

కోహెడలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

17న గవర్నర్ పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- బస్వాపూర్‌లో 50 ఎకరాల్లో మొక్కల నాటే కార్యక్రమం

కోహెడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలంలో ఈనెల 17న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ పర్యటించనున్నారు. కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ రానున్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. నిబంధనలు అతిక్రమించకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఏజెన్సీకి తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో తాత్కాలిక హెలీప్యాడ్ ఏర్పాటు చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులకు సూచించారు. మండలంలోని బస్వాపూర్‌లో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో మెగా ఆయిల్ ఫామ్ మొక్కల నాటే కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కోహెడ మండల కేంద్రంలో భారీ సభ నిర్వహించనున్నారు. మహిళలకు స్టీల్ సామగ్రిని గవర్నర్ అందించనున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, డీఆర్డీవో జయదేవ్‌ఆర్య, డీపీవో దేవకీ దేవి, పోలీస్ అధికారులు ఉన్నారు.

పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలి

సిద్దిపేట క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ కోహెడ మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్, జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదన్నారు. ఎవరి వారు తమ విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని చెప్పారు.


మంజూరు పత్రాన్ని అందుకుంటున్న లబ్ధిదారు

ఇందిరమ్మ లబ్ధిదారులకు
మంజూరు పత్రాలు

- అందజేసిన కలెక్టర్ హైమావతి

సిద్దిపేట అర్బన్/కొమురవెల్లి/చేర్యాల జూలై 15 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులకు, కొమురవెల్లి మండలంలోని 83 మంది లబ్ధిదారులకు కలెక్టర్ హైమావతి ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట కేసీఆర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. హరీశ్‌రావు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కృషితోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గదరాజు చందు అన్నారు. చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలానికి చెందిన 437మంది పట్టాలు అందుకున్నట్లు చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి
కరెంటు కష్టాలు

ఆదిలోనే అవాంతరాలు

- పట్టణ, గ్రామీణ ప్రాంత శివారులో కానరాని కనెక్షన్
- విద్యుత్ కావాలంటే ఒక్కో స్తంభానికి రూ.12,500 వేలు చెల్లించాల్సిందే
- దూరాన్ని బట్టి నాలుగైదు స్తంభాలు అవసరం
- కేటగిరీ- 2 కింద విద్యుత్ మీటరుకు రూ.4,050
- బోరు వేయాలంటే రూ. లక్ష అదనపు భారం
- జిల్లాలో రెండు విడతల్లో మంజూరైన ఇళ్లు 11,605
- జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నిర్మాణం 54.11 శాతమే
- 45 రోజుల్లో నిర్మాణం చేపట్టకపోతే వెనక్కి
- అయోమయంలో లబ్ధిదారులు!


ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో పనులు ప్రారంభించని లబ్ధిదారు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 15: సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తి పైసాపైసా కూడబెట్టుకుని పట్టణ శివారులో 60 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రెండో విడతలో లబ్ధిదారుడిగా ఎంపికయ్యాడు. దీంతో ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకుందామనుకుని బెస్‌మెంట్ లెవల్ కోసం సుతారి మేస్త్రీ, వడ్డెరులకు కొంత డబ్బు చెల్లించాడు. మంచి రోజు చూసుకొని నిర్మాణ పనులు ప్రారంభిద్దామనుకుంటే నీరు అవసరమని మేస్త్రీ లబ్ధిదారుడికి సూచించారు. వెంటనే సంబందిత విద్యుత్ సిబ్బంది వద్దకు వెళ్లి కనెక్షన్ కావాలని కోరాడు, ఆ ప్రాంత లైన్‌మన్ వచ్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు దాదాపు ఐదు స్తంభాలు అవసరమని చెప్పాడు. ఒక్కో స్తంభానికి దాదాపు 12వేలకు పైనే ఖర్చవుతుందని చెప్పడంతో లబ్ధిదారుడు షాక్ అయ్యాడు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలా చాలా మంది ఇందిరమ్మ లబ్ధిదారుల పరిస్థితి ఇలాగే ఉంది.

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా మారింది. ఇందిరమ్మ లబ్ధిదారుల పరిస్థితి. నిరుపేద ప్రజల కల సాకారం చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి జిల్లాలో ఆది నుంచి లబ్ధిదారులకు సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. లబ్ధిదారుడిగా ఎంపిక కావడంతో ఆ ఆనందం పట్టుమని పది రోజులు కూడా ఉండడం లేదు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపడుదామనుకుంటే రూ.2లక్షలైనా ఉండాల్సిందే. ఇంటి నిర్మాణానికి అవరమయ్యేందుకు నీటి కోసం బోరు వేయడానికి రూ.లక్ష, విద్యుత్ కనెక్షన్ కావాలన్నా, పనులు ప్రారంభం చేయాలన్న మరో లక్ష రూపాయలు తప్పనిసరి. గత ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నూతనంగా విద్యుత్ కనెక్షన్ కావాలంటే నామమాత్రపు ఫీజు చెల్లించేవారు. కానీ నేడు విద్యుత్ కనెక్షన్‌పై గతంలో మాదిరి నిబంధనలు పెట్టకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచక అయోమయానికి గురవుతున్నారు.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వివరాలు

ప్రాంతం	ఫేజ్-1	ఫేజ్-2	మొత్తం	మార్కింగ్	బీఎల్	గోడలు	స్లాబ్
సిద్దిపేట	439	2,399	2,838	1,192	73	28	13
దుబ్బాక	653	2,042	2,695	1,498	73	24	05
గజ్వేల్	639	2,298	2,937	1,524	84	50	28
హుస్నాబాద్	356	1,150	1,506	1,160	275	89	34
బెజ్జంకి	80	422	502	379	49	17	10
జనగామ	491	636	1,127	526	148	64	23

(జనగామ అంటే ప్రస్తుత జిల్లాలోని చేర్యాల, చేర్యాల మున్సిపల్, ధూళిమిట్ట, కొమురవెల్లి, మద్దూర్)- (బీఎల్ : బేస్‌మెంట్‌లెవల్)

రెండు విడతల్లో మంజూరైన ఇళ్లు 11,605

సిద్దిపేట జిల్లా వ్యాపంగా రెండు విడతల్లో 11,605 ఇందిరమ్మ ఇళ్ల

మిగతా 8వ పేజీలో


సిద్దిపేట పట్టణంలో ప్లాట్లకు దూరంగా ఉన్న విద్యుత్ స్తంభం

ఒక్కో స్తంభానికి రూ.12,500

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రారంభంలోనే లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ కనెక్షన్ కావాలంటే ఆ శాఖ అధికారులు చెప్పిన మాటలు వినగానే షాక్‌కు గురవుతున్నారు. నూతనంగా విద్యుత్ మీటర్ కనెక్షన్ కావాలంటే పలు కేటగిరీల కింద కనెక్షన్‌ను ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయానికొస్తే కేటగిరి-2 కింద విద్యుత్ మీటర్‌కు రూ. 4,050తో పాటు నిర్మాణ స్థలం వరకు ఇచ్చేందుకు ఒక్కో పోల్‌కు రూ. 12,500 చొప్పున (స్తంభం వైర్లు, కాసారాలు, ఇతర పరికరాలు) డీడీ చెల్లించాలని విద్యుత్ సిబ్బంది సూచిస్తున్నారు. ఇలా పలు చోట్ల లబ్ధిదారులకు ఐదారేసి స్తం భాలు అవసరముండటంతో దాదాపుగా రూ. 80 వేల వరకు ఖర్చు అవుతుండటంతో పనులను ప్రారంభించడం లేదు. చాలామంది అప్పులు చేసి మరి నిర్మాణాలు ప్రారంభం చేశారు. దీంతో బెసిమెంట్ లెవల్‌లో వచ్చిన డబ్బును మిత్తితో అప్పు తీసుకున్నవారికి తిరిగి చెల్లిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో
అంతరాయం

గజ్వేల్ జూలై 15 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని బెజుగామ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ జగదీశ్ ఆర్య ఓ ప్రకటనలో తెలిపారు. బెజుగామ, జాలిగామ, చిన్న ఆరేపల్లి, రాయపోల్ మండలం పెద్ద ఆరేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మద్రాస్ ఐఐటీతో అనంతసాగర్ పాఠశాల
భాగస్వామ్యం

చిన్నకోడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కనెక్ట్ పేరుతో మద్రాస్ ఐఐటీ నిర్వహిస్తున్న కార్యక్రమానికి చిన్నకోడూరు మండలం అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భాగస్వామ్యం కానున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మంగళవారం తెలిపారు. ఐఐటీలో చేరడానికి కావలసిన ప్రాథమిక విషయాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా, సైన్స్ లాంటి వివిధ కోర్సులకు సంబంధించిన ప్రాథమిక విషయాలు, కోడింగ్‌ను మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్లతో ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు నేర్చుకోనున్నట్టు తెలిపారు.

రేగులపల్లిలో కేంద్ర బృందం
పర్యటన

- ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలన

7

భలే సంపత్తి

- ఉమ్మడి జిల్లాలో 33 ఏళ్లలో భారీగా పెరిగిన సాగు విస్తీర్ణం
- నాడు ఎకరమే.. నేడు ఒక్కోరైతు పదుల ఎకరాల్లో సాగు
- సంప్రదాయ పంటలకు స్వస్తి.. వాణిజ్య సాగుపై దృష్టి
- సీసీఐ మద్దతు ధరతో పత్తి రైతులకు మేలు

7


దుబ్బాకలోని శివాజీ విగ్రహం వద్ద పాచిపట్టిన ఫౌంటెన్ నీరు

కళావిహీనంగా జంక్షన్లు

దుబ్బాక, జూలై15(ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని కూడళ్ల అభివృద్ధికి రూ.లక్షలు వెచ్చించినా మున్సిపల్ తీరుతో కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని ఛత్రపతి శివాజీ జంక్షన్, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జంక్షన్ల అభివృద్ధికి రూ.50 లక్షల చొప్పున వెచ్చించారు. పట్టణంలోని శివాజీవిగ్రహం, తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద రెయిలింగ్, ఫౌంటెన్లు, వాటిలో అందంగా కనిపించే పక్షుల బొమ్మలు, అందమైన విద్యుత్ అలకంరణ ఏర్పాటు చేశారు. అయితే, ఏడాదిగా వాటి నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. గడ్డి మొలవడంతో పాటు రెయిలింగ్ చుట్టూ మొక్కలు పెరిగాయి. సిబ్బందితో చేయించాల్సిన చిన్న చిన్న పనులను కూడా సరిగా చేపట్టకపోవడంతో ఫౌంటెన్‌లో నీరు అలాగే ఉండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. విద్యుత్ దీపాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. అంబేడ్కర్ విగ్రహం చుట్టూ గడ్డి పెరిగింది.



దుంపలపల్లి వార్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పెరిగిన గడ్డి

సందడిగా
ఫుడ్ ఫెస్టివల్


ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ సందడిగా సాగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ సందాని, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు రకరకాల వంటకాలను ప్రదర్శించారు. వంటకాలు రుచి చూసి విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారం నాగేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు జనార్ధన్, స్వప్న, తరన్నుం, నాజియా, లక్ష్మయ్య, అనిల్ కుమార్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కనుల పండువగా ఫలహార బండి ఊరేగింపు

సిద్దిపేట కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఒక జాతి సంస్కృతి పండుగలతోనే తెలుస్తుందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రశాంత్‌నగర్ పోచమ్మ ఆలయం వద్ద జరిగిన ఫలహారం బండి ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి మాట్లాడారు. తెలంగాణ అంటేనే బోనాలు, బతుకమ్మ పండుగలన్నారు. బోనాల పండుగలో భాగంగా నిర్వహించే ఫలహారం బండి ఊరేగింపు చూస్తుంటే హైదరాబాద్‌లో ఉన్నామా? సిద్దిపేటలోనా అనే సందేహం వస్తుందన్నారు. పండుగ సంబరం అద్భుతంగా ఉందన్నారు. అంతకు ముందు పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆటపాటలతో సాగిన ఊరేగింపు చూడటానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.


ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి

ఘనంగా
శీత్లాభవాని ఉత్సవాలు



హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్‌తండాలో నృత్యం చేస్తున్న గిరిజనులు


నైవేద్యం తీసుకొస్తున్న యువతులు, మహిళలు

హుస్నాబాద్‌రూరల్/అక్కన్నపేట,జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసంలో గిరిజనులు తమ ఆరాధ్యదైవమైన శీత్లా భవాని వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ మాసంలో ఏదో ఒక మంగళవారం తండా పెద్దల సూచన మేరకు ఈ ఉత్సవాలు జరుపుకుంటారు. అందులో భాగంగా హుస్నాబాద్ మండలం పూల్ నాయక్‌తండాలో, అక్కన్నపేట మండలం కేశనాయక్ తండా, చెరువు ముందు తండా, బోధర్ వాగు తండాలో గిరిజనులు శీత్లా భవానిదేవి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో చిన్నా, పెద్దా ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు.


అక్కన్నపేట మండలంలోని బోధర్‌వాగుతండాలో మొక్కులు చెల్లిస్తున్న గిరిజనులు







ఎనిమిది కేజీల ఎండు గంజాయి పట్టివేత

రామచంద్రాపురం టౌన్ జూలై 15 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఎండు గంజాయి అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా మన్‌హళ్లి అనే గ్రామానికి చెందిన ఖురేషి షబ్బీర్ అలీ అనే వ్యక్తి ఒరిషా రాష్ట్రం నుంచి ఎనిమిది కేజీల ఎండు గంజాయి తెచ్చి మంగళవారం సాయంత్రం ఇక్రిశాట్ సమీపంలోని పారగాన్ చెప్పుల కంపెనీ ఎదురుగా అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 8కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఖురేషి షబ్బీర్ అలీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకున్నారు.







రెంటికి చెడ్డ రేవడి..!

నాన్‌వెజ్ మార్కెట్ ప్రారంభంపై సందిగ్ధత



చేర్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని అంగడిబజార్‌లో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ నాన్‌వెజ్ మార్కెట్ భవనం ప్రారంభంపై నెలకొన్న సందిగ్ధతతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి నిర్మించినా.. ప్రజాప్రతినిధులు, అధికారుల అలసత్వం వల్ల నిరుపయోగంగా మారింది. మున్సిపల్ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి ఈ భవనాన్ని నిర్మించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో మాంసం దుకాణాలు రోడ్డు పక్కనే కొనసాగుతున్నాయి.

గతంలో లక్షకుపైగా ఆదాయం

చేర్యాల అంగడిబజార్‌లో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఆదాయ వనరుల కోసం కూరగాయలు, మాంసం, ఇతర దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. దీంతో మున్సిపాలిటీకి నెలకు లక్షకుపైగా ఆదాయం లభించేది. సిద్దిపేట జిల్లాలో విలీనం తర్వాత 2018లో చేర్యాల మున్సిపాలిటీగా మారింది. అప్పుడు మంత్రి హరీశ్‌రావు చొరవతో చేర్యాలలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా, స్థల ఎంపిక వివాదాస్పదమైంది.

స్థానికుల అసంతృప్తి

ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ భవన పనులు పూర్తైతే పట్టణానికి ల్యాండ్‌మార్క్‌గా నిలిచేది. కానీ ప్రధాన దారి సమస్య పరిష్కారం కాకపోవడంతో కేవలం రేకులషెడ్డుతో కూడిన నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని మాత్రమే పూర్తి చేశారు. శివారులో ఉండాల్సిన నాన్‌వెజ్ మార్కెట్‌ను పట్టణం నడిబొడ్డున నిర్వహించాల్సిన దుస్థితి నెలకొనడంతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. కేవలం మాంసం దుకాణాలు కొనసాగే రేకుల కప్పు భవనం కోసం మున్సిపల్ కార్యాలయం, ఆర్‌సీసీ భవనాలను అనవసరంగా కూల్చివేసి, అంగడిబజార్ చౌరస్తాను రెంటికి చెడ్డ రేవడిలా మార్చారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధికారంలోకి వస్తే అస్తవ్యస్తంగా మారిన నాన్‌వెజ్ మార్కెట్ బిల్డింగ్‌ను కూల్చివేసి, అంగడిబజార్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రజోపయోగకర భవనాలను నిర్మించి సుందరీకరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నాన్‌వెజ్ మార్కెట్ భవనాన్ని కూల్చివేయిస్తారా, లేక ప్రారంభానికి చర్యలు చేపడతారా అనేది చర్చనీయాంశంగా మారింది.

వ్యాపారుల, ప్రజల ఇక్కట్లు

షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేసిన నాటి నుంచి మాంసం దుకాణాలు రోడ్డు పక్కనే ఆరుబయట కొనసాగుతున్నాయి. స్లాటర్‌హౌస్ లేకపోవడంతో దుకాణాల ఆవరణలోనే మేకలు, గొర్రెలు, కోళ్లను వధిస్తున్నారు. రక్తపు వ్యర్థాలతో పాటు అస్తవ్యస్తమైన పారిశుద్ధ్య పనులతో అంగడిబజార్ పరిసరాలు కంపుకొడుతున్నాయి. వైరాలను పక్కన పెట్టి, అంగడిబజార్ చౌరస్తాకు పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చేగుంట జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా నిరంతరం అధికారులు పర్యవేక్షణ జరపాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చేగుంట మండల పరిధిలోని పులిమామిడి, బోనాల గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు త్వరితగతిన పనులు పూర్తయ్యే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మెదక్ జిల్లాను ముందు వరుసలో ఉంచాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి ప్రశ్నలు సమాధానాలతో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, హౌసింగ్ ఏఈ రియాజ్, ఎంపీ ఓ ప్రశాంత్ ,పంచాయతీ కార్యదర్శులు సరిత రేఖ తదితరులు ఉన్నారు.



పులిమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

ఝరాసంగం, జూలై15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీలపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శివయ్య(48) మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల చికిత్స నిమిత్తం ఝరాసంగం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతిడికి ఇద్దరు కుమారులు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రాంచెందర్ మాట్లాడుతూ శివయ్య కుటుంబానికి ప్రభుత్వ పరంగా రూ, 25 లక్షలు అందజేయడంతో పాటు ఇంట్లో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో విధులు చేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యుదాఘాతంతో రెవెన్యూ రికార్డు అసిస్టెంట్ ..

చేగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పొలం వద్ద స్టార్టర్ డబ్బా మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్పల్లి శ్రీనివాస్ (35) పొలం వద్ద స్టార్టర్ డబ్బా వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్ తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్‌కి భార్య రమ్య, ఇద్దరు కుమారులు భరత్, దీక్షిత్‌లు ఉన్నారు. మృతుడి సోదరుడు బిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు ఎస్సై చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు .శ్రీనివాస్ మృతి విషయం తెలుసుకున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, ఇబ్రహీంపూర్ గ్రామానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా రూ.20 వేలు సాయంతో పాటు అదనంగా రూ.10 వేలు శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్‌లు శ్రీకాంత్, షేక్ కరీం, శ్రీనివాస్‌లు ఉన్నారు.

సిద్ధాపూర్ తండాలో ఉపాధి కూలీ..

కోహీర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీ పనులు చేస్తూ ఓ వ్యక్తి చనిపోయాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని సిద్దాపూర్ తండాలో ఉపాధి కూలీ భీమ్లా నాయక్ (50) మంగళవారం ఉదయం ఉపాధి పనులు చేస్తూ సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందాడు. భీమ్లా నాయక్ రోజువారి మాదిరిగానే మంగళవారం ఉదయం కూడా ఉపాధి పనులకు వెళ్లాడు. తాండ శివారులో మళ్లింపు కాలువ పనులు చేస్తుండగా భీమ్లా నాయక్ సొమ్మసిల్లి కింద పడిపోయాడు. ఇది గమనించిన మిగతా కూలీలు అతడిని చికిత్స నిమిత్తం గ్రామానికి తీసుకువచ్చారు. అప్పటికే భీమ్లా నాయక్ మృతి చెందాడు. భీమ్లా నాయక్‌కి భార్య, ఓ కొడుకు ఉన్నాడు.విషయం తెలుసుకున్న ఏపీవో సునందరావు సిద్ధాపూర్ తాండాకు వెళ్లి మృతి చెందిన ఉపాధి కూలీ భీమ్లా నాయక్ వివరాలను తెలుసుకొని సంబంధిత ఉపాధి జిల్లా ఉన్నంత అధికారులకు తెలియజేశారు. పనులు చేస్తూ అకస్మాత్తుగా మృతి చెందిన భీమ్లా నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని తాండ గిరిజన ఉపాధి కూలీలు ప్రభుత్వాన్ని కోరారు.

కూతురితో కలిసి వివాహిత అదృశ్యం

పెద్దశంకరంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తన ఐదు సంవత్సరాల కూతురుతో కలిసి వివాహిత అదృశ్యమైంది. పెద్దశంకరంపేట పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పెద్దశంకరంపేట గ్రామానికి చెందిన చీలపల్లి రేణుక, భర్త సాయిలు, తన ఐదు సంవత్సరాల కూతురుతో కలిసి పీర్ల పండుగ కోసం పెద్దశంకరంపేటకు ఈనెల 6న వచ్చారు. పండుగ అనంతరం వారు హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో భర్త సాయిలు తన అత్త బూదెమ్మకు ఫోన్ చేసి భార్య రేణుక, కూతురులు కనపడటం లేదని తెలిపాడు. దీంతో అత్త బూదెమ్మ తెలిసిన వారి దగ్గర, బంధువుల వద్ధ వెతికింది. ఈ సందర్భంగా పెద్దశంకరంపేటలో బూదెమ్మ, తన కూతురు, మనుమరాలు కనపడటం లేదని ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో తాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

పాడి గేదెల చోరీ

మద్దూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాయపల్లి గ్రామంలో పాడి గేదెలను చోరికి గురయ్యాయి. మంగళవారం బాధిత రైతు మోతుక్కారి పర్శరాములు తెలిపిన కథనం ప్రకారం.. ఆదివారం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద పాడిగేదెలను కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారి పొలం వద్దకు వెళ్లి చూడగా రెండు గేదెలు కన్పించలేదు. చుట్టు పక్కల పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. అక్కడ టాటా ఏస్ వాహనం టైర్ల ముద్రలు కన్పించడంతో అందులో తరలించినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. ఇదే గ్రామంలో కొద్ది రోజుల క్రితం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్‌వైర్ చోరికి గురవ్వడంతో పాటు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరికి గురయ్యాయి. దీంతో బాధిత రైతులు వరుస చోరీల ఘటనలతో భయాందోళన చెందుతున్నారు. పోలీసులు చోరీలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకుని రైతుల భయాందోళనల్ని తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

టేక్మాల్ జూలై 15 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న వ్యక్తిని డీసీఎం ఢీ కొనడంతో అతడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవాం సాయంత్రం టేక్మాల్ మండలంలోని సాలోజీపల్లి గ్రామ శివారులో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పారాం తాండాకు చెందిన నేనవత్ వాల్యా(45) టేక్మాల్ నుంచి బోడ్మాట్‌పల్లి వైపు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తతుండగా డీసీఎం ఢీ కొనండంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలెసుకున్న టేక్మాల్ ఎస్సై క్రిష్ణ సంఘటన సలానికి చెరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని ఓ బియ్యం దుకాణంపై పౌర సరఫరాల శాఖ విజిలెన్ అండ్ టాస్క్ ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రవాణాకు సహకరించిన ఐదు బైకులను సీజ్ చేశారు. విజిలెన్స్ అండ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ పట్టణంలోని సువర్ణ షెట్కార్ రోడ్డులోని విఠల్ బియ్యం దుకాణంలో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు దుకాణంపై దాడి చేశారు. దాడుల్లో 37 సంచుల్లో ఉన్న సన్నబియ్యం, 17 సంచుల్లో నింపిన దొడ్డు బియ్యం కలిపి మొత్తం 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించాయి. పంచనామా నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని స్థానిక పౌర సరఫరాల శాఖ గోదానికి తరలించారు. ఈ దాడుల్లో స్థానిక ఆర్ఐ మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో పంచనామ నిర్వహిస్తున్న అధికారులు

మెదక్ జిల్లాకు ముగ్గురి అధికారుల రాక

మెదక్ అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాకు బదిలీపై ముగ్గురు అధికారులు వచ్చారు. సంగారెడ్డి జిల్లా మెప్మా పీడీగా పని చేసిన గీత మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయ డిప్యూటీ సీఈవోగా బదిలీపై వచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారిగా పని చేసిన దేవ్ కుమార్ మెదక్ .జిల్లా వ్యవసాయ అధికారిగా బదిలీ వచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డా. నితిన్ కబ్రా నియమితులయ్యారు. కొత్తగా జిల్లాకు వచ్చిన అధికారులు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించారు.

భలే సంపత్తి

ఉమ్మడి జిల్లాలో 33 ఏళ్లలో భారీగా పెరిగిన సాగు విస్తీర్ణం

- నాడు ఎకరమే.. నేడు ఒక్కో రైతు పదుల ఎకరాల్లో సాగు
- సంప్రదాయ పంటలకు స్వస్తి.. వాణిజ్య సాగుపై దృష్టి
- సీసీఐ మద్దతు ధరతో పత్తి రైతులకు మేలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో పత్తి సాగు గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు సంప్రదాయ పంటలకే పరిమితమైన ఈ ప్రాంత రైతులు, ఇప్పుడు పత్తిని ప్రధాన వాణిజ్య పంటగా స్వీకరించి, ఎకరం నుంచి పదుల ఎకరాలకు సాగును విస్తరించారు. మెళకువలు, బీటీ విత్తనాల రాకతో సాగులో విప్లవం వచ్చింది. దీంతో విత్తనాలు, మందుల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో దళారుల బారి నుంచి రైతులు విముక్తి పొంది, తమ శ్రమకు తగ్గ మద్దతు ధర పొందుతున్నారు. ఇది రైతులకు ఆర్థికంగా చేదోడుగా నిలుస్తోంది.

- మునిపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి)



ఉమ్మడి మెదక్ జిల్లాలో పత్తి సాగు మొదలై 33 ఏళ్లు పూర్తయ్యింది. ఒకప్పుడు శనగ, జొన్న, పెసర, మినుము వంటి పంటలు సాగు చేసిన రైతులు, ఇప్పుడు పత్తిని ప్రధాన వాణిజ్య పంటగా మార్చుకున్నారు. 1992లో వలస వచ్చిన కొంతమంది రైతులు ఇక్కడ భూములు కౌలుకు తీసుకొని పత్తి, మొక్కజొన్న సాగు చేయడంతో ఈ ప్రాంతంలో పత్తికి బీజం పడింది. అప్పట్లో స్థానిక రైతులు పత్తి సాగుపై పెద్దగా ఆసక్తి చూపలేదు. 2002లో కొందరు రైతులు ఒకటి, రెండు ఎకరాల్లో పత్తి సాగు మొదలుపెట్టారు. అప్పట్లో లూజు విత్తనాల కారణంగా దిగుబడులు తక్కువగా ఉండటం, ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోయారు. దీంతో లూజు విత్తనాల(ఎల్‌కే 157)కు స్వస్తి పలికి 2004లో బీటీ విత్తనాలతో పంటల సాగుచేయడం మొదలు పెట్టారు. క్రమేణా పత్తి సాగు లాభసాటిగా మారడంతో సాగు విస్తీర్ణం పెంచుతూ వచ్చారు. ఒకప్పుడు ఎకరం వేసిన రైతులు కూడా ఏకంగా పదుల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు.

అప్పుడు రూ.100.. ఇప్పుడు రూ.901

గతంలో లూజు విత్తనాలు ఉండేవి. అప్పట్లో పురుగుల నుంచి పంటను కాపాడటానికి రైతులు తీవ్రంగా శ్రమించేవారు. అవి తక్కువ ధరకే దొరికినా, దిగుబడులు సరిగా వచ్చేవి కావు. బీటీ విత్తనాలు మార్కెట్‌లోకి రావడం.. బ్యాక్టీరియా, వివిధ పురుగుల నుంచి రక్షణ కల్పించడంతో రైతులు పత్తి సాగుకు ఆసక్తి చూపారు. బీటీ విత్తనాలతో పురుగు మందుల వాడకం కూడా కొంత తగ్గింది. 1992 నుంచి 2001 వరకు లూజు విత్తనాలను గోనె సంచుల్లో కిలోల రూపంలో విక్రయించేవారు. ఎకరానికి రెండు, మూడు కిలోల విత్తనాలు అవసరమయ్యేవి, కిలోకు రూ.100 చొప్పున విక్రయించేవారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా, నాన్ బీటీ విత్తనాల వల్ల పురుగుల నివారణకు అధికంగా మందులు వాడాల్సి రావడంతో ఖర్చులు పెరిగి లాభాలు అంతంతమాత్రమే ఉండేవి. ఆ తరువాత పలు కంపెనీలు హైబ్రిడ్ విత్తనాలను బీటీగా మార్చడం రైతులకు కలిసి వచ్చింది. 2004లో పత్తి ప్యాకెట్ ధర రూ.650 ఉండగా, ప్రస్తుతం 900 గ్రాముల ప్యాకెట్ రూ.901గా ఉన్నది. పురుగు మందుల ధరలు కూడా గతంలో ఉన్న ధరల కంటే నాలుగు రెట్లు పెరిగాయి.

సీసీఐ మద్దతు ధర

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో సీసీఐ కేంద్రాలు ఉన్నప్పటికీ, మెదక్ జిల్లాలో మాత్రం 2014 వరకు ఏర్పాటు చేయలేదు. 1993లో క్వింటాల్ పత్తికి రూ.1600 ఉన్నది. ధర క్రమంగా పెరుగుతూ 2012లో రూ.3,700కు చేరింది. దళారుల బారి నుంచి తప్పించడంతోపాటు మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2013లో క్వింటాలుకు సీసీఐ మద్దతు ధర రూ.3600 కాగా, ప్రతీ ఏడాది పెంచుతూ వస్తున్నారు. గతేడాది రూ.7,521 ఉండగా, ఈ ఏడాది రూ.8,110గా నిర్ణయించింది.

30 ఎకరాలు సాగు చేస్తున్నాను



1997లో 20 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. అప్పట్లో ఎకరానికి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు కౌలు ఉండేది. ఇప్పుడు ఎకరానికి రూ.20 వేల కౌలు చెల్లించాల్సి వస్తున్నది. నాన్ బీటీ విత్తనాలకు బదులుగా బీటీ విత్తనాలు రావడంతో పురుగు మందుల వాడకం తగ్గింది. గతంలో ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా మద్దతు ధరలు లేక ఇబ్బంది పడేవాళ్లం.

- బల్లగిరి నర్సింహారావు, రైతు

23 ఏళ్లుగా పత్తి సాగు చేస్తున్నాను



23 ఏళ్లుగా నేను పత్తి పంటను సాగు చేస్తున్నాను. గతంలో పత్తి ప్యాకెట్లు లూజుగా ఉండేవి. అప్పట్లో పురుగుల నుంచి పంటను రక్షించుకోవడానికి చాలా కష్టపడేవాళ్లం. బీటీ విత్తనాలు వచ్చినప్పటి నుంచి కొంత వరకు మేలు జరిగింది. గతంలో ఒక ఎకరం మాత్రమే వేసాను. ఇప్పుడు సొంత భూమితో పాటు కొంత పొలాన్ని కౌలుకు తీసుకొని 10 ఎకరాల వరకు సాగు చేశాను.

-బండారి బాలరాజ్, రైతు, మల్లికార్జునపల్లి, మునిపల్లి మండలం





ఉపాధ్యాయులు హర్షవర్దన్, శివప్రసాద్

బోధకుల నుంచి పరిశోధకులుగా!

● జగదేవ్‌పూర్ ఉపాధ్యాయుల ఘనత

జగదేవ్‌పూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు పరిశోధనలోనూ తమ సత్తా చాటేందుకు పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. జగదేవ్‌పూర్ మండలానికి చెందిన ఇద్దరు యువ ఉపాధ్యాయులు పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలో రాష్ట్రస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. తీగుల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కర్రావుల హర్షవర్ధన్ రసాయనశాస్త్రంలో ప్రథమ ర్యాంకు సాధించగా, గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న బొల్లి శివప్రసాద్ తత్వశాస్త్రంలో ఆరో ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, పరిశోధనలపై ఉన్న ఆసక్తితో కష్టపడి చదివి ఈ విజయాన్ని అందుకున్నారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారిద్దరిది సిద్దిపేట జిల్లాలోని బెజ్జంకి మండలం. హర్షవర్ధన్‌ది మండలంలోని పెరుకుబండ కాగా, శివప్రసాద్‌ది గుండారం గ్రామం. చిన్ననాటి నుంచి ప్రభుత్వ విద్యా సంస్థల్లోని చదివి ఈ స్థాయికి చేరుకున్నారు. తీరిక సమయాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. తమ కష్టానికి ఫలితంగా రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించామని, తమ కల సాకారం కాబోతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

కొత్త పీర్ సవార్ ఉత్సవాలు



కొత్తపీర్ సవార్ ఉత్సవాల్లో భక్తులు

నర్సాపూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌లో మంగళవారం సాయంత్రం కులమతాలకు అతీతంగా కొత్తపీర్ సవార్ ఉత్సవాలు నిర్వహించారు. ప్రతి ఏటా పీర్ల పండుగ అయిన 9వ రోజు కాగజ్‌మద్దూర్‌లో హిందూ, ముస్లింలు కలిసికట్టుగా సోదరభావంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈసారి కూడా పీర్లను గ్రామస్థులంతా కలిసికట్టుగా ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శేఖర్‌తో పాటు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా గ్రామంలో హిందువులు సైతం తమ ఇళ్లకు బంధువులను పిలిపించుకుని పండుగలా నిర్వహించుకోవడం విశేషం. ఇది గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది.

దళితులపై దాడులను ఉపేక్షించం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న బక్కి, వెంకటయ్య తదితరులు

బర్కత్‌పుర, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దళితులపై జరిగే దాడులను ఉపేక్షించేది లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇటీవల మెదక్ జిల్లా హవేలిఘనపూర్ మండలం బూర్గుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిరిజన ఉపాధ్యాయుడు నరేందర్ నాయక్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, గిరిజన శక్తి అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్, గిరిజన జేఏసీ నేత రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బక్కి వెంకటయ్య హాజరై మాట్లాడారు. రాజకీయాల ముసుగులో పాఠశాలలో చొరబడి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులపై దాడి చేయడం అమానుషమన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నరేందర్ నాయక్‌పై దాడి చేసిన బీజేవైఎం నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, నాయకులు శ్రీరాములు, రాజేందర్, అశోక్, సంజీవ్, వెంకటయ్య పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లతో ఎత్తిపోతల పథకం

● పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్



జీవో కాపీని చూపుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్

జోగిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గంలోని పెద్దారెడ్డిపేట వద్ద రూ. వెయ్యి కోట్లతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయనున్నట్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) ఉపాధ్యక్షుడు పట్లోల్ల సంగమేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో ఈ ఎత్తిపోతల పనులకు మరో రెండు నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని సంగమేశ్వర్ తెలిపారు. తలాపునే సింగూరు ప్రాజెక్టు ఉన్నా సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న అందోలు, ఉమ్మడి పుల్కల్, వట్‌పల్లి, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల రైతులకు సాగునీరందించేందుకు మంత్రి దామోదర్ ఈ పథకాన్ని చేపట్టారని చెప్పారు. ఈ పథకం వల్ల ఆయా మండలాల్లోని 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని వివరించారు. కాగా, ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్) పనుల కోసం రూ. 1.10 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 136ను విడుదల చేసిందన్నారు. ఎక్కడెక్కడ ఏయే పనులు చేయాలన్న విషయమై డీపీఆర్ సిద్ధం చేసి ఒక నెలరోజుల్లో ప్రభుత్వానికి అందజేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారని, డీపీఆర్ పూర్తైన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ఎత్తిపోతల పనులకు శంకుస్థాపన చేస్తారని, అనంతరం విడతల వారీగా అవసరమైన నిధులను మంజూరు చేస్తారని సంగమేశ్వర్ వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సమావేశంలో జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, అక్సానపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు జీఆర్ నరేందర్‌రెడ్డి, జోగిపేట మాజీ సర్పంచ్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు పీ.రాంరెడ్డి, తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డేవిడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షుడు శివరాజ్ యాదవ్ (అందోలు), నిమ్మ రమేశప్ప (టేక్మాల్), రమేశ్ జ్యోషి (వట్‌పల్లి), నాయకులు జీఆర్ మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అశోక్, శేఖర్, హన్మంతు, సైలాన, రాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేశాను.. క్షమించు అంబేద్కరుడా..!

● విగ్రహం వద్ద మద్యం తాగిన ఫలితం



అంబేడ్కర్ విగ్రహానికి మొక్కుతున్న వ్యక్తి

కంది, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జుల్‌కల్ గ్రామంలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. సోమవారం రాత్రి కొందరు అంబేడ్కర్ విగ్రహం వద్ద మద్యం సేవించి ఖాళీ సీసాలను వదిలేశారు. మంగళవారం ఉదయం ఈ విషయం గ్రామస్థులు గమనించడంతో పాటు ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామానికి చెందిన ముగ్గురు అక్కడ మద్యం తాగినట్లు గ్రామస్థులు గుర్తించి ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు వారిలో ఒకరితో మంగళవారం ఉదయం అంబేడ్కర్ విగ్రహానికి మొక్కి, క్షమాపణలు చెప్పించారు. అతను కూడా మళ్లీ ఇలాంటి తప్పు చేయనని గ్రామస్థులకు చేతులెత్తి నమస్కరించాడు. కాగా, ఆ వ్యక్తి అంబేడ్కర్ విగ్రహానికి, గ్రామస్థులకు క్షమాపణలు చెప్పే దృశ్యాలను గ్రామస్థులు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో వైరల్ చేశారు. పోలీసుల జోక్యంతో ఈ వ్యవహారం సద్దుమణిగింది.

19న ఐఐటీహెచ్‌లో స్నాతకోత్సవం

● హాజరుకానున్న కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్

కంది, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 19న 14వ స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ స్నాతకోత్సవంలో బీటెక్, ఎంటెక్, పీహెచ్‌డీలలోని వివిధ విభాగాలకు చెందిన దాదాపు 1265 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో పాటు డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగంలో మొదటిసారిగా పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులు పట్టాలు అందుకోవడం విశేషమని పేర్కొన్నారు.

క్షేత్ర సహాయకుల వేతనాలు పెంచాలని మంత్రి సీతక్కకు వినతి



మంత్రి సీతక్కను కలిసిన ఎంపీ సురేష్ షెట్కార్, క్షేత్ర సహాయకులు

నారాయణఖేడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులను ఫుల్‌టైం ఉద్యోగులుగా గుర్తించి వేతనాలను పెంచాలని వారు కోరారు. ఈ మేరకు మంగళవారం కామారెడ్డికి వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, క్షేత్ర సహాయకుల సంఘం బాధ్యులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గత 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ వన మహోత్సవం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ గృహాల సర్వే, స్వచ్ఛభారత్ మిషన్, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల పనుల పర్యవేక్షణతో పాటు పలు ప్రభుత్వ పనుల విజయవంతంలో భాగస్వాములవుతున్నారని వారు వివరించారు. పనికి తగ్గ వేతనాలను పెంచి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎంపీ వెంట క్షేత్ర సహాయకుల సంఘం బాధ్యులు జ్ఞానరెడ్డి, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

ఆర్డీవోకు నిమ్జ్ అదనపు బాధ్యతలు



జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి

జహీరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నిమ్జ్ అధికారిగా ఆర్డీవో రాంరెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు నిమ్జ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా కొనసాగిన రాజీరెడ్డి ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆ స్థానం ఖాళీ అయింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఆర్డీవోగా కొనసాగుతున్న రాంరెడ్డికి నిమ్జ్ అధికారిగా ఈ అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో రాంరెడ్డి ఒకవైపు ఆర్డీవో బాధ్యతలు, మరోవైపు నిమ్జ్ ప్రత్యేక అధికారి, ఇంకోవైపు మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన పరిధిలో లేని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ, నిమ్జ్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే నేరుగా కార్యాలయానికి వచ్చి నిర్భయంగా చెప్పుకోవచ్చని ప్రజలకు సూచించారు.



కేంద్ర బృందం సభ్యులను సన్మానిస్తున్న మహిళ సంఘం సభ్యులు

రేగులపల్లిలో కేంద్ర బృందం పర్యటన

● ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలన

బెజ్జంకి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి మండలం రేగులపల్లి గ్రామాన్ని మంగళవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 12 రకాల పథకాల అమలు తీరును పరిశీలించారు. ముఖ్యంగా, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి, మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన రుణాల సద్వినియోగం గురించి ఆరా తీశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన బెజ్జంకి 8 రేగులపల్లి రోడ్డు, నర్సరీ, డంపింగ్ యార్డును బృందం సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు, ఐకేపీ ఏపీఎం నర్సయ్య, సీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

● ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఆనంద్



బెజ్జంకి కేజీబీవీలో కోడిగుడ్డును పరిశీలిస్తున్న ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్

బెజ్జంకి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, విద్యార్థులు, బాలింతలు, గర్భిణులకు విధిగా పౌష్టికాహారం అందించాలని ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వీరాపూర్ అంగన్‌వాడీ కేంద్రం, బేగంపేట ఉన్నత పాఠశాల, బెజ్జంకిలోని అంగన్‌వాడీ, కేజీబీవీ, ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెజ్జంకి పీహెచ్‌సీలో ప్రసూతి సేవల గురించి మెడికల్ ఆఫీసర్ మాధురిని అడిగి తెలుసుకున్నారు కేజీబీవీలో విద్యార్థినులకు రక్తశాతం తక్కువగా ఉండటం, సరైన పౌష్టికాహారం అందకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, పండ్లు, కూరగాయలు నాణ్యత లేవని స్పష్టం చేశారు. ఈ విషయమై డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఆనంద్, సదరు కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, చెల్లింపులను రికవరీ చేసి, రికవరీ రిపోర్టును ఫుడ్ కమిషన్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆహార భద్రత కమిషన్ సభ్యురాలు భారతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈవో మహతి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

● దళిత సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

మెదక్, కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రెలి అనిల్ కుమార్‌ను హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని మెదక్ జిల్లా దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గుల్షన్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ యువజన నాయకుడు అనిల్ కుమార్ హత్య వెనుక ఉన్న రాజకీయ కుట్ర కోణాన్ని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని, ఈ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. నాయకులుగా ఎదుగుతున్న దళితులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను త్వరగా పట్టుకుని శిక్షించకుంటే ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ మాదిగ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, మందకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆస్త్రగల్ల బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ మెదక్ పట్టణ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ గంటరాజు, మేకల రవి, రాజు, మహేష్, ఉషస్‌గల్ల, బాబయ్య, నాయకులు బాబు మహేందర్, సుధాకర్, శ్రీనివాస్, ప్రవీణ్, యోహాన్ జాన్, ప్రతాప్, కుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు సీపీఐ జిల్లా మహాసభ

హుస్నాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని కేజేఆర్ గార్డెన్‌లో బుధవారం నిర్వహించే సీపీఐ జిల్లా నాలుగవ మహాసభలకు ఆ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మహా సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హాజరవుతున్నారన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి మల్లె చెట్టు చౌరస్తా మీదుగా గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు గడిపె మల్లేశ్ తెలిపారు.

కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి హరీశ్‌రావు విరాళం

చిన్నకోడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) :చిన్నకోడూరులో లైట్ మోటార్ వెహికిల్ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కట్ట మైసమ్మ ఆలయానికి మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రూ. 51 వేలు విరాళంగా అందజేశారు. నగదును మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాముని ఉమేష్ చంద్ర అసోసియేషన్ సభ్యులకు అందజేశారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

సిద్దిపేట క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా స్థాయి సమావేశం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న కోత్వాల్ యాద నరేందర్ 13 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టనందున ఆయనను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా కొనసాగుతున్న సింగిరాల శ్రీనివాస్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ చేసిన తీర్మానాన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు ఆమోదించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అల్పుల స్వామిని ఆమోదించారు.

భవన నిర్మాణ కార్మికుల మహాసభను జయప్రదం చేయండి

జగదేవ్‌పూర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని భవన నిర్మాణ కార్మికుల మండల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్(బీసీడబ్ల్యూ) యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని మునిగడప, వట్టిపల్లి, చాట్లపల్లి, గుబ్బడి తీగుల్ నర్సాపూర్ గ్రామాల్లో కార్మికులకు కలిసి మహాసభను విజయవంతం చేయాలన్నారు.

నైపుణ్యాలను వెలికితీయాలి

మిరుదొడ్డి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీయాలని మిరుదొడ్డి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మోడల్‌స్కూల్ ప్రపంచ నైపుణ్యదినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందికునేందుకు నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

వసతులను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి,.జూలై15(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఇందిరమ్మ సంబురాల్లో బాగంగా రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, తదితరులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తొగుటలో 11 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.4,17,500 విలువైన చెక్కులను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, దుబ్బాక నియోజకవర్గ కోఆర్డినేటర్ విజయ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనాకర్‌రెడ్డి, భరత్‌తేజ పాల్గొన్నారు.

LOST OF PASSPORT
I, JANAGAMA VENKATA MADHAVA RAO, S/o. Laxman Rao, R/o. H.No. 6-53, Koheda (V & M), Siddipet Dist., T.G. My original Passport No: HYD215517807 has been lost by me while I am going from my House to Koheda Xerox Center for Passport Xerox copy by Bike. If anybody found please Contact:
9440966141

ఇలాగైతే ఎలా..?



కొమురవెల్లిలో రైతు వేదిక భవనం

కొమురవెల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయంలో తోడ్పాటును అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో రెండు, మూడు గ్రామాలను కలిపి ఒక క్లస్టర్‌గా గ్రామాల్లో రైతు వేదికలు నిర్మించారు. రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించేందుకు, వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ పంటల సాగు సమాచారాన్ని రైతులకు అందించేందుకు రైతువేదికలు ఎంతో కీలకంగా మారిన సంగతి తెలిసిందే. అప్పుడప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా రైతు వేదికల్లో జరిగే సమావేశాల్లో పాల్గొని రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఇటీవలే రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇలా గ్రామీణ ప్రాంత రైతులకు రైతు వేదికలు చాలా ఉపయోగపడుతున్నాయి. అయితే కొమురవెల్లి మండలంలో ఏకంగా 5 గ్రామాలకు ఒకే రైతు వేదిక ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మండల కేంద్రంలో పరిస్థితి ఇలా..

కొమురవెల్లి మండలంలోని కొమురవెల్లి, అయినపూర్,పోసాన్‌పల్లి, గురువన్నపేట, తపాస్‌పల్లి ఐదు రెవెన్యూ గ్రామాలకు కలిపి మండల కేంద్రంలో ఒకే రైతువేదిక ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు సంబంధించిన సమావేశాలు ఉన్నప్పుడు, వివిధ పనుల నిమిత్తం వ్యవసాయ అధికారులను కలవడానికి మండల కేంద్రానికి రాక తప్పని పరిస్థితి ఏర్పడటంతో సమయం వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు.వ్యవసాయ అధికారులు కూడా 5 గ్రామాల రైతులకు సంబంధించిన పనులు, ఫీల్డ్ విజిట్, వివిధ సర్వేల సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం మండల కేంద్రంలోని రైతువేదికకు వచ్చి చాలా సమయం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒక్కోసారి రోజు మొత్తం సమయం వృథా అవుతుందని రైతులు వాపోతున్నారు.

మరో రైతు వేదికను నిర్మించాలి

మండలంలోని గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి మూడు గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నూతనంగా రైతు వేదికను నిర్మించాలనీ రైతులు కోరుతున్నారు. అంతవరకు ఒక ఏఈవోను నియమించి తాత్కాలికంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సేవలందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఐదు గ్రామాలకు ఒకే రైతువేదిక

- మండలకేంద్రానికి దాదాపు 14 కిలోమీటర్లు ప్రయాణం
- సమావేశాల నిర్వహణ, క్షేత్రస్థాయి పర్యవేక్షణలోనూ తప్పని ఇబ్బందులు
- ఇటీవలే ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం రోజంతా ఎదురు చూపులతో విసిగిపోయిన రైతులు
- మరో రైతు వేదిక నిర్మించాలని డిమాండ్

మూడు గ్రామాలకు అందుబాటులో ఉండాలి



తపాస్‌పల్లి, గురువన్నపేట గ్రామాల నుంచి కొమురవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికకు రావాలంటే దాదాపు 14 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సివస్తుంది. ఈ మూడు గ్రామాలకు అందుబాటులో ఉండే ప్రభుత్వం నూతనంగా రైతు వేదికను నిర్మించి ఏఈవోను నియమిస్తే రైతులకు దూరాభారం తగ్గుతుంది. సమయం ఆదాతో పాటు రవాణా ఖర్చులు కలిసివస్తాయి. వ్యవసాయ సమావేశాలు జరిగినప్పుడు రైతులు ఎక్కువమంది పాల్గొని పలు విషయాల పట్ల అవగాహన పెంచుకునే వీలు కలుగుతుంది.

\- పుట్ట రమేష్ రైతు తపాస్‌పల్లి

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

- ఒకరికి మూడు రోజుల జైలు

సిద్దిపేట క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 18 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం నిందితులకు రూ.28,500 జరిమానా విధించారు. నిందితుల్లో ఒకరికి జరిమానాతో పాటు 3 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


సిద్దిపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత, హాజరైన విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యువనైపుణ్యం దినోత్సవాన్ని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కాలేజ్ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి సునీత పాల్గొని మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక అందుబాటులో ఉన్న నేటి కాలంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. నైపుణ్యం పెంచుకుని యువత ఉజ్వల ఉద్యోగ అవకాశాలను పొందాలన్నారు. ఫిజిక్స్ విభాగధిపతి డా. సీహెచ్. మధుసూదన్ మాట్లాడుతూ రోబోటిక్స్ ఇన్నోవేషన్ ల్యాబ్ ద్వారా యువత నైపుణ్యాలను మెరుగుపరచటంలో కళాశాల ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యారెడ్డి, ఎన్‌సీసీ కేర్‌టేకర్ బి. కృష్ణయ్య, గురుచరణ్ దాస్, డా. శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను విద్యాబోధనకే పరిమితం చేయాలి

- తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

తొగుట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులను పూర్తిగా విద్యాబోధనకే పరిమితం చేయాలని తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ మండల కమిటీనాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తొగుట ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో మెమోరాండం సమర్పించి మాట్లాడారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించడం తలకు మించిన భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వంటవారికి సరైన సమయంలో బిల్లులు రాకపోవడం వల్ల వంటచేసే వారు వెళ్లిపోవడంతో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడం ఇబ్బందిగా మారుతుందన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సంబంధించి ప్రత్యామ్నాయ భోజన నిర్వాహణను నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీనాయకులు రాంచెంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, రాములు, బాలరాజ్, మల్లేశం, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తే అధిక దిగుబడులు


కూరగాయ పంటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి కౌసల్య

సిద్దిపేట రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): కూరగాయల పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు బాగా ఉంటాయని ఉద్యాన శాఖ అధికారి కౌసల్య రైతులకు సూచించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్, చిన్నగుండవెల్లి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ.. రైతులు ఎంఐడీహెచ్ పథకం ద్వారా వచ్చే మల్చింగ్ సబ్సిడీని వినియోగించుకోవాలని తెలిపారు. కాకర, సొర, బీర వంటి తీగ జాతి పంటలు పందిరి సాగు ద్వారా పెంచి మంచి లాభాలు పొందవచ్చునని తెలిపారు.

నానో ఎరువులతో రైతులకు మేలు

సిద్దిపేటఅర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గుళికల రూపంలో ఉండే డీఏపీ, యూరియా కంటే నానో టెక్నాలజీతో తయారుచేసిన ద్రవ రూప ఎరువులతో రైతులకు మేలు జరుగుతుందని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయాధికారి బి. శ్రీనాథ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి, బూర్గుపల్లి క్లస్టర్ పరిధిలోని రైతులకు నానో డీఏపీ, యూరియా, పొటాష్ వల్ల కలిగే ప్రయోజనాలపై ఇఫ్కో ప్రతినిధితో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నానో టెక్నాలజీతో తయారుచేసిన ద్రవ రూప డీఏపీ, యూరియా, పొటాష్‌లను వాడడం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం


వైద్య శిబిరంలో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుందన్నారు. వెంట గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఐకేపీ ఏపీఎం దుర్గప్రసాద్, నాయకులు తదితరులున్నారు.

మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగరేస్తాం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ కౌన్సిలర్ గుండ్ర నర్సింలు ఇటీవల బీజేపీలో చేరగా, ఆయనను తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల సానుకూల వాతావరణం ఏర్పడిందని, త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వెంట వంటి మామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్, నాయకులు తదితరులున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

హుస్నాబాద్‌రూరల్/కుకునూరుపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం పోలీసులు క్రమశిక్షణ, సైబర్ నేరాలు, గంజాయి, మత్తుపదార్థాల నిరోధం, రోడ్డు నిబంధనలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచితుల మాటలు నమ్మి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎస్ఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, షీ టీం బృందం సభ్యులు సదయ్య, మహిళా కానిస్టేబుల్ ప్రశాంతి, స్వప్న, కృష్ణ ఉన్నారు. కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, పోలీసు బృందంతో కలిసి మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్, షీటీం, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై విద్యార్థులకు తెలియజెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయ బృందం, షీటీం బృందం పలువురు పోలీసులు పాల్గొన్నారు.

పోలీసుల కనువిప్పు

చిన్నకోడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మహిళలు నిర్మానుష్య ప్రదేశాల్లో ఒంటరిగా తిరగవద్దని ఎస్ఐ సైఫ్ అలీ సూచించారు. చిన్నకోడూరులో సోమవారం రాత్రి పోలీసు కళాబృందం సభ్యులు ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కళా బృందం, తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యులు రోడ్డు ప్రమాదాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, చేత బడులు, ఇతర సామాజిక రుగ్మతల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళా బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో మంగళవారం ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపు జరిపి పోచమ్మ తల్లికి నైవేద్యాలను నివేదించారు.

\- దుబ్బాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి)

రామంచ పాఠశాలలో గోరింటాకు సంబరాలు

చిన్నకోడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గోరింటాకు విశిష్టతను గూర్చి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్లా షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గోరింటాకును చూపుతున్న రామంచ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

మద్దూరు ఆస్పత్రిలో తనిఖీ


మహిళా సంఘాల సభ్యులతో డిప్యూటీ డీఎంహెచ్‌వో

మద్దూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం మహిళా గ్రూపుసభ్యులకు నిర్వహించిన హెల్త్‌క్యాంపులో సిబ్బంది అందిస్తున్న సేవల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ హెల్త్ క్యాంపులో మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రజిత, ఫార్మసిస్ట్ సందీప్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి


ఉపముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

దుబ్బాక/మిరుదొడ్డి, జూలై 15(ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఆయన వెంట కమిషన్ సభ్యులతో పాటు దుబ్బాక మాజీ ఎంపీటీసీ అంజనేయులు తదితరులున్నారు.

ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటిన మేనేజర్

సిద్దిపేట అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు చక్కటి పూల మొక్కల తో పరిసరాలను ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని సిద్దిపేట డిపో మేనేజర్ రఘు అన్నారు. మంగళవారం సిద్దిపేట ఆర్టీసీ డిపో పరిధిలో పూల మొక్కలను వివిధ రకాల పండ్ల మొక్కలను నాటారు. డిపో పరిధిలో నాటిన మొక్కలను సిబ్బంది బాధ్యతతో పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీసీ ఆకుల రాజేందర్, రాములు, సత్తయ్య, అసిస్టెంట్ డిపో మేనేజర్ మహేశ్వరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు


శాకంబరి అలంకరణలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కొమురవెల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆర్యవైశ్య సత్రంలో ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం మహిళలు కన్యకాపరమేశ్వరి మాతను శాకంబరి అలంకారంలో దర్శించుకున్నారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు జలాభిషేకం


బంటుపల్లిలో గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

హుస్నాబాద్‌రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మడద పంచాయతీ పరిధిలోని బంటుపల్లి గ్రామంలో వర్షాల కోసం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామస్థులు గ్రామదేవతలకు జలాభిషేకాలు చేశారు. వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో వేసిన పంటలు చేతికి అందే పరిస్థితి లేకుండా పోతుందేమోనన్నే ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ దేవతలైన పోచమ్మ, హనుమాన్, ఎల్లమ్మ ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు చేసి వరుణుడి కరుణకోసం వేడుకున్నారు.

కొండపాక ఆదర్శ పాఠశాలలో మాక్ పోలింగ్


ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు

కొండపాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి):ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కొండపాక ఆదర్శ పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు మన ప్రజాస్వామ్యం ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ నామినేషన్ ప్రక్రియతో మొదలుకొని అభ్యర్థుల ఎంపిక, గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పత్రాల ముద్రణ తదితర అంశాలను పూర్తి ఎన్నికల వాతావరణంతో వివిధ విభాగాలను నిర్వహించారు. ఎలక్షన్స్ నిర్వహణలో ప్రధాన పాత్ర పోషించిన సోషల్ డిపార్ట్‌మెంట్ టీచర్స్‌ను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడలకు ప్రథమ ప్రాధాన్యం

- జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటనరసయ్య

గజ్వేల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతనిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి జంగపల్లి వెంకటనరసయ్య అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మినీ స్టేడియంను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా న్యూ స్పోర్ట్స్ పాలసీలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు. క్రీడా రిజర్వేషన్లు పక్కాగా అమలుపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. సీఎం కప్పులో పాల్గొన్న వారికి స్పోర్ట్స్ రిజర్వేషన్లను కల్పించనుందని పేర్కొన్నారు. గజ్వేల్‌లో క్రీడా వసతుల కల్పనకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. మినీ స్టేడియానికి ప్రహరీతో పాటు మరిన్ని క్రీడా వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. వెంట క్రీడాకారులు గణేశ్, వర్మ, సంతోష్, నర్సింలు, నగేశ్, చక్రపాణి, తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

అక్కన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మాలోతు లక్ష్మీ, మాజీ జడ్పీటీసీలు మాలోతు బీలు నాయక్, భూక్యమంగ, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు, మాజీ మార్కెట్ చైర్మన్ కాసర్ల అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే అవాంతరాలు

(5వ పేజీ తరువాయి)


సిద్దిపేటలో ప్లాట్లకు దూరంగా ఉన్న విద్యుత్ స్తంభం

మంజూరయ్యాయి. వీటిలో మొదటి విడత కింద 2,658, రెండోలో 8,947 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గానూ నాలుగు విడతల్లో రూ.5లక్షలు ప్రభుత్వం అందిస్తునున్నది. వీటిలో బేస్‌మెంట్ లెవల్‌కు రూ. లక్ష, స్లాబ్‌కు రూ. 2 లక్షలు, గోడలకు రూ. లక్ష, మొత్తం పూర్తి చేశాక రూ. లక్ష మంజూరు చేస్తున్నది. జిల్లాలో మంజూరైన 11,605 ఇళ్లకు గానూ మొదటివిడతలో 792 మంది, రెండో విడతలో 5487, మొత్తంగా 6,279 మంది ఇళ్ల పనుల కోసం మార్క్ అవుట్ చేయగా, బెస్‌మెంట్ లెవల్ పూర్తైనవారు 702 మంది, గోడలు పూర్తి చేసిన వారు 272 మంది, స్లాబ్ వేసిన వారు 113 మంది లబ్ధిదారులున్నారు.

45 రోజుల్లో నిర్మాణం చేపట్టకపోతే వెనక్కి

జిల్లాలో మంజూరైన ఇళ్లలో 45 రోజుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకుంటే లబ్ధిదారుడి పేరును తొలగించి వెయింటింగ్‌లో ఉన్న వారికి మంజూరు చేయనున్నారు. దీంతో ఇళ్ల పనులు ప్రారంభించాలంటే విద్యుత్ కనెక్షన్ అవసరముండటంతో చాలామంది పనులను ప్రారంభించలేదు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరై దాదాపుగా 15 రోజులు గడుస్తున్నా పనులు ఎలా ప్రారంభించాలని లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. కొంతమంది పాత ఇళ్లను తొలగించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, చాలామంది ఓపెన్ ప్లాట్‌లలో నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. అధికారులు నామమాత్రంగా విద్యుత్ కనెక్షన్ కోసం రుసుము పెట్టి తమపై ఆర్థిక భారం పడకుండా చూడాలని లబ్ధిదారులు వేడుకొంటున్నారు.